క్లుప్తంగా

అక్రమంగా షెడ్డు నిర్మాణం



షెడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటున్న పంచాయతీ అధికారులు

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామ పంచాయతీలో చెరువు ఆక్రమణపై అధికారులు చర్యలు చేపట్టారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు ఊర చెరువు, బోదె, పంచాయతీ రోడ్డు మార్జిన్‌ను బళ్లమూడి శశిరేఖ ఆక్రమించారని స్పందనలో ఫిర్యాదు అందింది. పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన నోటీసులు పట్టించుకోకుండా ఆక్రమిత స్థలంలో సిమెంట్ స్తంభాలు పాతి షెడ్డు వేస్తున్నారనే సమాచారం మేరకు పంచాయతీ అధికారులు అక్కడికి చేరుకున్నారు. రోడ్డు మార్జిన్లు, ప్రభుత్వ భూములు, కాల్వగట్లు, చెరువులు, ఆక్రమించరాదని హెచ్చరించారు.

'మానవత'లో సభ్యులను చేర్పించాలి



నారాయణపురంలో సమావేశమైన సభ్యులు

ఉంగుటూరు: మానవత సంస్థలో అత్యధికంగా సభ్యులను చేర్పించాలని మానవత సంస్థను బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు కోరారు. ఆదివారం నారాయణపురంలో నిర్వహించిన నెలవారి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సమావేశానికి మండల అధ్యక్షుడు సూర్యనారాయణరాజు అధ్యక్షత వహించారు. త్వరలో మండల శాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, కార్యదర్శి గంజి రవి, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, మందా జయలక్ష్మి, పాతూరి వంశీ పాల్గొన్నారు.

వాసవీమాతకు పూజలు



వాసవీమాత జయంతి సందర్భంగా పూజలు చేస్తున్న వర్తక సంఘ సభ్యులు

గణపవరం: గణపవరం కన్యకాపరమేశ్వరి వర్తక సంఘ భవనంలో ఆదివారం వాసవీమాత జయంతి సందర్భంగా సంఘం సభ్యులు వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీమాత జయంతి రోజున వర్తక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఏటా ఈ చలివేంద్రం నిర్వహిస్తున్నట్లు వర్తక సంఘం అధ్యక్షుడు ఆర్‌వీఎస్ రాజు తెలిపారు. కార్యక్రమంలో వర్తక సంఘం ఉపాధ్యక్షుడు వంకాయల రామారావు, కార్యదర్శి నడింపల్లి రాంపండు, మానవత మండల కార్యదర్శి బి.పుల్లయ్య, సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శాంతియుత వాతావరణమే లక్ష్యం



ప్రజలతో సమావేశమైన పెదపాడు ఎస్సై బీ నాగబాబు

పెదపాడు: గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొనేలా అందరూ కృషి చేస్తూ స్నేహపూర్వకంగా మెలగాలని పెదపాడు ఎస్సై బీ నాగబాబు తెలిపారు. పెదపాడు మండలంలోని నాయుడుగూడెం, తోటగూడెంలో ప్రజలు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగబాబు మాట్లాడుతూ గ్రామాల్లో ఫ్లెక్సీలు చించివేయడం ద్వారా ఇరువర్గాల మధ్య విభేదాలు సృష్టించేందుకు కొంతమంది ప్రయత్నిస్తుంటారని అలాంటి వాటిని నిరోధించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులతో శాంతి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎలాంటి గొడవలకు పోకుండా ముందస్తుగా చర్యల్లో భాగంగా ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కత్తుల ప్రేమావతి, ఏలూరు డివిజన్ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్ గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు పూజలు

పెదవేగి : మండలంలోని రాట్నాలకుంటలో రాట్నాలమ్మ ఆలయంలో నియోజకవర్గ ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం దేవస్థానానికి విచ్చేసిన ప్రముఖులను కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్ల విక్రయం ద్వారా రూ. 46,310, విరాళాలు రూ.2,887, లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ. 31,350, ఫొటోల విక్రయం ద్వారా రూ.1377 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్ సతీష్ కుమార్ తెలిపారు.

పాఠశాలలకు సెలవులు..ఆఖరి రోజు జోష్



భీమడోలు ఉన్నత పాఠశాలలో చిన్నారులు ఇంటికి వెళ్తున్న దృశ్యం



పోలసానిపల్లి పాఠశాలలో సంతోషం వ్యక్తం చేస్తున్న చిన్నారులు



గుండుగొలను హాస్టల్‌లోని బాలికలు, వార్డెన్‌తో కలిసి అల్పాహారం తింటున్న దృశ్యం

భీమడోలు: ఈ విద్యా సంవత్సరం చివరి రోజైన ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది. సెలవు రోజైనా చిన్నారులంతా పాఠశాలకు వచ్చి సందడి చేసారు. చిన్నారులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. 41 రోజుల పాటు ప్రభుత్వం వేసవి సెలవులను ప్రకటించింది. పని దినాలు తక్కువగా ఉండడంతో ప్రభుత్వం ఆదివారం పాఠశాలలను తెరిచింది. రెండు రోజుల క్రితమే పరీక్షలు ముగియగా టీచర్లు మూల్యాంకనం పూర్తి చేసారు. చిన్నారులకు ప్రగతి పత్రాలను ఉపాధ్యాయులు పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించి అందజేసారు. ఆఖరి పనిదినం కావడంతో విద్యార్థుల హాజరు అత్యల్పంగా నమోదైంది. మండల వ్యాప్తంగా 45 ప్రభుత్వ పాఠశాలల్లో 4,200 మంది చదువుతుండగా చివరిరోజు 30 నుంచి 40శాతం మాత్రమే పాఠశాలలకు చిన్నారులు వచ్చారు. వారందరికీ సోమవారం జగనన్న గోరుముద్ద పథకంలో చిన్నారులకు రుచిరకంగా భోజనాలు పెట్టారు. కొన్ని పాఠశాల్లో ఫేర్‌వేల్ కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, టీచర్లు సహపంక్తి భోజనాలు చేసారు. 41 రోజుల వేసవి సెలవుల అనంతరం ఏప్రిల్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. మే 8వ తేదీ నుంచి శాఖా గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసే వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత హెచ్‌ఎంలు విద్యార్థులు సూచించారు.

సందడి చేసిన విద్యార్థులు

సమాజ సేవలో 'మానవత' ముందంజ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యకుమార్

నిడమర్రు: సమాజ సేవలో మానవత సంస్థ ముందంజలో ఉండేలా సంస్థ సభ్యులు కృషి చెయ్యాలని ఆ సంస్థ చైర్మన్ సంకు సత్యకుమార్ అన్నారు. ఆదివారం బావాయిపాలెంలో ముత్యాల సత్యనారాయణ నివాసం వద్ద సంకు శ్రీనివాసరావు అధ్యక్షతన మండల మానవత సంస్థ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన సేవా కార్యాక్రమాలు, భవిష్యత్తులో నిర్వహించే కార్యక్రమాలపై సభ్యులు సమీక్షించి పలు తీర్మానాలు చేసారు. ఈ కార్యక్రమంలో నౌడు అచ్యుతరామారావు, గొట్టుముక్కల విశ్వనాథరాజు, మైలవరపు లాలయ్య, ముత్యాల రామ సుబ్బారావు, ముత్యాల బాలాజీ, పుప్పాల శ్రీను, దారాబత్తుల సరయ్య, సంకు పద్మాకర్, బొబ్బిలి వెంకటేశ్వరరావు, గొట్టుముక్కల శ్రీనురాజు పాల్గొన్నారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న దెందులూరు ఎస్సై వీర్రాజు

దెందులూరు: ప్రతి గ్రామంలో అందరూ స్నేహపూరిత వాతావరణంతో కలిసిమెలిసి జీవించాలని, ఏ గ్రామంలోనైనా ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పెదవేగి సీఐ ఎస్.దుర్గాప్రసాద్ అన్నారు. ఆదివారం గోపన్నపాలెంలో దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు ఆధ్వర్యంలో సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ అధ్యక్షతన గ్రామ సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామం ప్రశాంతంగా ఉండేందుకు శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా సహకరించడం ప్రజలందరి బాధ్యత అన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు శాంతి భద్రతలకు తమ పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఎస్సై వీర్రాజు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండేటి గంగాధరబాబు, ఉపసర్పంచ్ తోట పద్మారావు, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు యువత, గ్రామస్తులు, మహిళలున్నారు.

1.85 లక్షల గోనె సంచుల వినియోగం



కొవ్వలి కో ఆపరేటివ్ సొసైటీలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము

దెందులూరు: ధాన్యం కొనుగోళ్లపై టీడీపీ దుష్ప్రచారం పూర్తి అవాస్తవమని, వాస్తవాలు తెలుసుకోకుండా ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేలా దుష్ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కొవ్వలి కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము అన్నారు. ఆదివారం కోఆపరేటివ్ సొసైటీలో ఆయన మాట్లాడుతూ 1.82 లక్షల గోనె సంచులు తమకు ప్రభుత్వం లక్ష్యంగా ఇచ్చిందన్నారు. ఇప్పటికే కొవ్వలి సొసైటీ పరిధిలో 1.85 లక్షల సంచులతో ధాన్యం తరలించామన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే ప్రభుత్వాన్ని, వైఎస్సార్ సీపీ నేతలను అప్రతిష్టపాలు చేసేలా ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని అరికట్టేందుకు త్వరలోనే పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు, ప్రజలందరూ వాస్తవాలను గమనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సత్యనారాయణ, రైతులున్నారు.

పశుగ్రాసానికి కొరత

యంత్రాలతో మాసూళ్ల ప్రభావం



కొప్పాకలో యంత్రంతో వరి కోత చేస్తున్న దృశ్యం

పెదవేగి : వరి మాసూళ్లలో యంత్రాల వినియోగం బాగా పెరిగింది. మాసూళ్లను కూలీలతో చేయిస్తే ఖర్చుల భారం భరించలేక రైతులు యంత్రాల వినియోగం వైపు మొగ్గు చూపుతున్నారు. యంత్రాలతో వరి కోతలు పశుగ్రాసానికి ముప్పుగా మారింది. యంత్రాలతో వరి కోస్తే ఆ గడ్డిని పశుగ్రాసంగా పనికిరావడం లేదు. దీంతో వేసవిలో పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడే పరిస్థితులు తలెత్తాయి.

50 శాతం పైగా యంత్రాలతోనే మాసూళ్లు

ఎన్నడూ లేనివిధంగా ఈ దాళ్వాలో మాసూళ్లు 50 శాతం పైగా రైతులు వరికోత యంత్రాలను ఆశ్రయించారు. ధాన్యాన్ని త్వరగా ఇంటికి చేర్చుకునేందుకు వీలుండటంతో యంత్రాల వైపే మొగ్గుతున్నామని రైతులు చెబుతున్నారు. వరి దుబ్బలను సగానికి పైగా వదిలివేసి యంత్రాలు కోస్తాయి. దీంతో యంత్రాలతో మాసూళ్లు చేస్తే వచ్చే ఎండుగడ్డి పరిమాణం బాగా తగ్గుతోంది. దీనికి తోడు యంత్రంతో ధాన్యం నూర్చడం వల్ల గడ్డి పూర్తిగా నలిగి బయటకు వస్తుంది. ఇది పశువులు తినడానికి పనికిరావడం లేదు. పశుగ్రాసం కొరతను రైతులు అధిగమించేందుకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్నామని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎండుగడ్డి అయితే నిల్వ చేసుకుని వాడవచ్చని, పచ్చిరొట్ట తాత్కాలికంగా ఉపయోగపడుతుందని పశు పోషకులు వాపోతున్నారు.

యంత్రాలతో కోసిన గడ్డిని కూడా తినవచ్చు

మండలంలో గేదెలు ఆవులు మొత్తం కలిపి 44,523 ఉన్నాయి. యంత్రం ద్వారా కోసిన వరి గడ్డి చక్రాల కింద పడి చెల్లా చెదురవడంతోపాటు బురదలో పడిపోవడంతో పశువులు ఆ గడ్డిని తినేందుకు ఆసక్తి చూపవు. రైతులు ఆ గడ్డిని చిన్న ముక్కలుగా చేసి శుభ్రపరచి వేస్తే తినే అవకాశం ఉంది.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వం

పెదవేగి : కార్మిక వర్గం ప్రాణ త్యాగాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం మార్పులు చేయడం సిగ్గుచేటని సీఐటీయూ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ అన్నారు. ఆదివారం లక్ష్మీపురంలో మార్కెట్ యార్డులో ఆయన మే డే పోస్టర్ల ఆవిష్కరించి ప్రసంగించారు. కార్మిక చట్టాలను మే డే స్ఫూర్తితో సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పెట్టుబడిదారుల కోసం దేశ ప్రజల ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వం తాకట్టు పెట్టడం దుర్మార్గమన్నారు. కార్మికవర్గానికి రక్షణగా ఉన్న 44 చట్టాలను కార్పొరేట్స్ కోసం 4 లేబర్ కోడ్లుగా మార్చారన్నారు. మోదీ పాలనలో నిరుద్యోగం రోజురోజుకీ పెరుగుతోందన్నారు. పెదవేగి మండలంలో మే 1న జెండా ఆవిష్కరణలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి ప్రసాద్ సుబ్బారావు దుర్గారావు వెంకన్న పాల్గొన్నారు.

సింగవరంలో త్వరలో వైద్య శిబిరం

దెందులూరు: రెండు రోజుల క్రితం కల్తీ బిర్యానీ తిని అనారోగ్యానికి గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు ఆదివారం ఏలూరు వైద్యశాల నుంచి డిశ్చార్జి అయ్యారని ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పులవర్తి సంతోష్, వైఎస్సార్ సీపీ నాయకులు గుర్రం దిలీప్, శ్రీనివాస్, యోహాను అన్నారు. ఆదివారం సింగవరంలో బాధితుల ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. గ్రామంలో త్వరలో వైద్య శిబిరం, బాధితులకు అవగాహన సమావేశం నిర్వహించేందుకు వైద్యాధికారులు అంగీకరించారని నాయకులు తెలిపారు. సింగవరం బాధితులను ఆదుకునేందుకు సకాలంలో చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, పార్టీ నాయకులు కామిరెడ్డి నానికి గ్రామస్తులు కృతజ్ఞత తెలిపారు.

సమగ్ర భూసర్వేతో అనేక ప్రయోజనాలు



దేవరగోపపరంలో డ్రోన్‌తో రీ సర్వే ప్రారంభిస్తున్న అధికారులు

నిడమర్రు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో సమగ్ర భూ రీసర్వేతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని తాహసీల్దారు బి. సాయిరాజు తెలిపారు. ఆదివారం మండలంలోని దేవరగోపవరంలో సమగ్ర భూసర్వేని అధికారులు ప్రారంభించారు. తాహసీల్దారు మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి రీసర్వే చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పట్టాదారు పాసుపుస్తకాలు కంటే రీసర్వేలో ఇచ్చే భూహక్కు పత్రాలకే ప్రాధాన్యత ఉంటుందన్నారు. రీసర్వే డీటీ ఏవీ నాగేశ్వరరావు, మండల సర్వేర్ ఎస్. విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'మన్ కీ బాత్' ప్రదర్శన

దెందులూరు: సామాన్యులతో అనుసంధానానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్వహిస్తున్న మన్ కీ బాత్ కార్యక్రమం బృహత్తరమైన వేదిక అయిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తపన పౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామంజనేయచౌదరి అన్నారు. ఆదివారం కొవ్వలిలోని మొటపర్తి భవన్‌లో ప్రధాని నరేంద్రమోదీ నిర్వహిస్తున్న మన్ కీ బాత్ కార్యక్రమం 100వ ఎపిసోడ్‌ను ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారం చేశారు.

భీమడోలు: ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం ప్రజలు తిలకించేందుకు బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్టు పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్ తెలిపారు. మండలంలోని నాలుగు పోలింగ్ బూత్‌ల వద్ద టీవీల్లో పీఎం సందేశాన్ని ప్రజలు తిలకించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ విక్రమ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చిరుజల్లు .. రైతుల గుండెల్లో గుబులు



భీమడోలు ఏఎంసీ వద్ద టార్పాలిన్లతో కప్పిఉంచిన ధాన్యం బస్తాలు



భీమడోలులో లారీలో ధాన్యం లోడు చేస్తున్న కూలీలు

భీమడోలు: రెండు రోజులుగా ఆకాశం మేఘావృత్తమై కారుమబ్బులు కమ్మడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షం రైతుల్లో గుబులు రేపింది. అన్నదాతలు ఆరుగాలం పండించిన ధాన్యం రాశుల వద్దకు రైతన్నలు పరుగులు తీసారు. భారీ వర్షం వస్తే నట్టేట మునుగుతామని వారన్నారు. రోడ్లపై ఉన్న ధాన్యాన్ని పలు గ్రామాల్లో లారీల్లో తరలించి రక్షించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మిల్లుల వద్దకు ధాన్యాన్ని తరలించే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. 60శాతానికి పైగా ధాన్యం రోడ్లపై, కళ్లాలపై, ఎక్కడ జాగా దొరికితే అక్కడ రైతులు ధాన్యాన్ని షెట్లు కట్టుకుని కాపలా కాస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా వర్షం చినుకులు కురవడంతో రైతులు రోడ్లపై ఆరబోసుకున్న ధాన్యాన్ని బస్తాల్లో నింపి భద్రపర్చుకున్నారు. అధికారులు ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

వేంకటేశ్వర స్వామికి వెండి ఆభరణాల సమర్పణ





స్వామి వారికి వెండి మకర తోరణం, వెండి పాదపద్మం అందించిన భక్తులు, ఆలయంలో వేంకటేశ్వర స్వామి

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి వారికి ఆదివారం లక్షలాదిరూపాయల విలువ గల భక్తులు 19.298 కేజీల వెండి మకర తోరణం, వెండి పాదపద్మంను బహూకరించి తమ భక్తిని చాటుకున్నారు. గ్రామానికి చెందిన మామిళ్లపల్లి కృష్ణమూర్తి, నాగభాస్కర విజయకమలావతి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమార్లు మామిళ్లపల్లి జవహర్‌లాల్ నెహ్రూ, నరసింహామూర్తి, ఆదిశేషు, వారి మేనల్లుడు పవన్‌లు లక్షలాది రూపాయలు విలువ గల స్వామి వారికి 19.298 కేజీల వెండి మకర తోరణ ం, వెండి పాదపద్మంలను బహూకరించి తమ భక్తిని చాటారు. ఆలయ అభివృద్ధి కమిటి నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు సమక్షంలో భక్తులు ఆలయ ఈవో డి.శంకరరావులకు వాటిని అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజారి మంగపతి ఆచార్యులు ఆధ్వర్యంలో సంప్రోక్షణ పూజలు చేసారు. ప్రత్యేక పూజలు చేసిన తర్వాత వాటిని స్వామి వారికి అలంకరించి విశేషంగా ముస్తాబు చేసారు. గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వార్లను దర్శించుకుని పూజలు చేసారు. ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు, పూజారి మంగపతి ఆచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి చంద్రబాబు



పిప్పరలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న మాలమహానాడు అధ్యక్షుడు మంగరాజు

గణపవరం: రాష్ట్రంలో దళితులకు నిజమైన న్యాయం వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలనలోనే జరిగిందని, దళితుల ఆత్మగౌరవం నిలబెట్టేలా జగన్ పాలన ఉందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం మాలమహానాడు జిల్లా కార్యవర్గ అత్యవసర సమావేశం పిప్పరలో నిర్వహించారు. ఈ సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని విలేకరుల సమావేశంలో ప్రశ్నించిన చంద్రబాబుకు వారిపై ఎంత ప్రేమ ఉందో తెలుస్తోందన్నారు. దళితులకు న్యాయం జగన్ పాలనలోనే జరుగుతుందని ఆయన అన్నారు. పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేయడంతోపాటు, ఆంగ్ల మాద్యమం, విద్యాకానుక, అమ్మ ఒడి తదితర పథకాలతోపాటు, ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల నిర్మాణంలో దళితులు 90శాతం మంది లబ్ధి పొందుతున్నారని ఆయన అన్నారు. తెలుగుదేశం పాలనలోనే దళితులపై దాడులు, అత్యాచారాలు అధికంగా జరిగాయన్నారు. పేదల కష్టార్జితాన్ని చిట్టీల పేరుతో దోచేస్తున్న టీడీపీ నాయకులకు శిక్ష తప్పదని అన్నారు. రాజమండ్రిలో చిట్స్ పేరుతో ఛీటింగ్ చేసిన పచ్చనేతలను అరెస్టు చేస్తే తెదేపా నాయకులు ఎందుకు గగ్గోలు పెడుతున్నారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాలమహానాడు సభ్యులు వెంకటేశ్వరరావు, రత్నరాజు, మోహనరావు, చంటి, సాల్మన్, కృపారావు, మహేష్, త్రిమూర్తులు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు



పైడిచింతపాడులో రూ.30 లక్షలతో విద్యుత్ పనులు పూర్తిచేసిన అధికారులు



చాటపర్రుకాలనీలో స్తంభాలు తరలిస్తున్న దృశ్యం

- రూ.77 లక్షలతో అభివృద్ధి పనులు
- ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల ఏర్పాటు
- ఇంటింటికీ కనెక్షన్



మల్కాపురంలో విద్యుత్ స్తంభాలకు తీగలు లాగుతున్న సిబ్బంది

ఏలూరు రూరల్: జగనన్న కాలనీల్లో నివసించే పేదల ఇళ్లకు నాణ్యమైన కరెంట్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకోసం ఏలూరు మండలం, దెందులూరు నియోజకవర్గానికి ప్రభుత్వం రూ.77 లక్షలు ఖర్చు చేసింది. ఈ నిధులతో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేసి, వందలాది స్తంభాలు పాతి తీగలు ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం లబ్ధిదారుడు ఒక్కొక్కరికీ ఒక మీటర్, బెండ్‌పైప్, 20 మీటర్ల సర్వీస్ అందించి, ప్రతి ఇంటికీ ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారు. దీని ఖర్చు రూ.3వేలు ఉంటుంది. కొద్దిరోజులుగా చాటపర్రు సబ్‌స్టేషన వద్ద జగనన్న కాలనీ, కాపుల పేట, తిమ్మారావుగూడెం, జాలిపూడి వెలమపేట, మల్కాపురం కాలనీ, కొవ్వలి రోడ్డు, చింతమనేని కాలనీ, మాదేపల్లి చింతమనేని కాలనీ పైడి చింతపాడులోని జగనన్న కాలనీల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి.

24 గంటలు కరెంట్ సరఫరా

సబ్‌స్టేషన్ ద్వారా జగనన్న కాలనీల్లో నివసించే పేదల ఇళ్లకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిరంతరం కరెంట్ సరఫరా చేయనుంది. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో నివసించే ప్రజల కరెంట్ కష్టాలు ఎదుర్కొన్నారు. విద్యుత్ హెచ్చుతగ్గులు, కోతలు ఏర్పడ్డాయి. ఇళ్లకు నాణ్యమైన కరెంట్ సరఫరా కాలేదు. ఫలితంగా వేసవిలో ప్రజలు నానా కష్టాలు పడ్డారు. దీన్ని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీ ప్రజలు భవిషత్తులో కరెంట్ కష్టాలు ఎదుర్కొనకుండా ముందుగానే సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తోంది. దీంతో కాలనీ ప్రజలకు నిరంతరం కరెంట్ సరఫరా కానుంది.

మౌలిక వసతుల ఏర్పాటు

మా గ్రామంలో పేదల ఇళ్లకు ఇంత తొందరగా కరెంట్ సరఫరాచేస్తారని అనుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క స్తంభం వేయాలంటే అధికారులు చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు వందలాది స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కాలనీల్లో మౌలిక వసతుల కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తోంది.

– ముంగర సంజీవ్‌కుమార్, కొల్లేరు వైసీపీ నాయకుడు

కాలనీలు పేదలకు వరం

పైడచింతపాడు లేఅవుట్‌లోని జగనన్నకాలనీలో ప్రభుత్వం రూ.40 లక్షలు ఖర్చు చేసి మెరక చేసింది. ఇప్పుడు ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.2 లక్షలు ఇస్తున్నారు. ఉచితంగా విద్యుత్, వాటర్ కనెక్షన్ ఇస్తున్నారు. పేదలు ఎంతో సంతోషంగా ఇల్లు నిర్మించుకుంటున్నారు. కొద్దిరోజుల్లో రోడ్లు, డ్రెయినేజీ సైతం నిర్మిస్తామని అధికారులు అంటున్నారు.

– ముంగర తిమోతీ, సర్పంచ్, పైడచింతపాడు